కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37(బుధవారం)
కనిష్ఠం : 28

ఇవి కాటేస్తే... ప్రాణ సంకటమే! 6



ఏలేశ్వరంలో క్వారీలు

గుంజేద్దాం!



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా అడ్డగోలు సీనరేజీ దోపిడీ
- కాంట్రాక్టు గడువు రెండు నెలలే ఉండడంతో కాసుల కోసం బరితెగింపు
- ఉన్న సమయంలో కోట్లు వెనకేసుకునేలా సీనరేజీ సాకుతో ఎడాపెడా వసూళ్లు
- చెరువులు, పొలాల్లో మట్టి తవ్వుకునే రైతులు, పేదలకూ మినహాయింపు లేదు
- మట్టి తవ్వకానికి కేబినెట్ అనుమతిచ్చినా ఖాతరు చేయకుండా సీనరేజీ దందా
- అనేకచోట్ల రసీదులు సైతం ఇవ్వకుండా కంపెనీ పేరుతో సిబ్బంది నగదు వసూళ్లు
- రౌతులపూడిలో సీనరేజీ పేరుతో దందా చేస్తుండడంపై తిరగబడ్డ లారీ యూనియన్
- అంబాజీపేటలో మట్టి ట్రాక్టర్ల నుంచీ పన్ను వసూలుపై తిరగబడ్డ స్థానికులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ సీనరేజీ పేరుతో ఎడాపెడా దండేస్తోంది.. ఎక్కడికక్కడ జనం ముక్కుపిండి అడ్డగోలుగా దోచేస్తోంది.. సొంత పొలం.. చెరువుల్లోంచి రైతులు, స్థానికులు తట్టెడు మట్టి తీసుకువెళ్తున్నా వాలిపోతోంది.. సీనరేజీ ఫీజులు కట్టాలంటూ రుబాబు చేస్తోంది. ఒకపక్క వాణిజ్యేతర అవసరాలకు రైతులు చెరువుల నుంచి మట్టి తీసుకువెళ్లడానికి ఇటీవల కేబినెట్ అనుమతిచ్చినా తనకేం సంబంధం లేదన్నట్టు దందా చేస్తోంది. ఇంకో రెండు నెలల్లో సంస్థ కాంట్రాక్టు ముగియనున్న నేపథ్యంలో ఈలోపే కోట్లకు కోట్లు దండేసేందుకు బరితెగించేస్తోంది. అనేకచోట్ల రేయింబవళ్లు కంపెనీ పేరుతో సిబ్బంది సీనరేజీ పేరుతో రసీదు లు సైతం లేకుండా నగదు వసూలు చేస్తుండడంతో పలుచోట్ల జనం తిరగబడుతున్న పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వం 2023లో ఉమ్మడి జిల్లాలో చిన్న తరహా ఖనిజాల సీనరేజీ వసూలు బాధ్యతల నుంచి గనులశాఖను తప్పించి సుధాకర్ ఇన్‌ఫ్రాకు అడ్డగోలుగా కట్టబెట్టింది. రెండేళ్ల వ్యవధిలో రూ.223 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాలనే నెపంతో ఎక్కడికక్కడ పిండేసింది. ప్రభుత్వం మారాక 73 రోజులు కాంట్రాక్టు గడువు పెంచడంతో దందా కొనసాగిస్తోంది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చిన్న తరహా ఖనిజాలు, గనులు, క్వారీలు, లేటరైట్, ఇతర గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి గనులశాఖ ఎన్నో ఏళ్లుగా సీనరేజీ వసూలు చేసేది. తద్వారా ప్రభుత్వానికి ఏటా కోట్లలో ఆదాయం వచ్చేది. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ సీనరేజీ వసూలు బాధ్యతల నుంచి గనులశాఖను తప్పించేసింది. వీటి నుంచి భారీగా నిధులు బొక్కేయడం కోసం పథకం పన్ని ఏకంగా ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టింది. ఎవరికి తెలియకుండా అడ్డగోలుగా 2023 ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో చిన్న తరహా ఖనిజాల సీనిరేజీ వసూలు కాంట్రాక్టును ఏకంగా సుధాకర్ ఇన్‌ఫ్రా కంపెనీకి అప్పగించేసింది. రెండేళ్లపాటు ఈ కాంట్రాక్టు ఉండేలా ఆదేశాలు జారీచేసింది. ఇందుకుగాను రెండేళ్లకు ప్రభుత్వానికి రూ.233 కోట్లు చెల్లించేసి ఆపై ఎంత వసూలు చేసుకున్నా తనకు సంబంధం లేదన్నట్టు స్పష్టం చేసింది. పైగా రూ.233 కోట్లు ఒకేసారి కాకుండా నెలకు రూ.9.70కోట్ల చొప్పున ప్రభుత్వానికి కట్టేలా వెసులుబాటు కల్పించింది. సదరు కంపెనీ వెనుక ఉన్న ఓ కీలక వైసీపీ నేత చేతికి అధికారం దక్కడంతో రెచ్చిపోయారు. ఉమ్మడి జిల్లాలో క్వారీలు, మైనింగ్ జరిగే ప్రాంతాలు, చెరువులు, కొండలు ఉన్నచోట్ల ఏకంగా భారీగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ప్రైవేటు సైన్యాన్ని దింపి ప్రతి లారీ నుంచి ముక్కుపిండి సీనరేజీని ఈ కంపెనీ వసూలుచేసింది. ఈ కంపెనీ రాకముందు నెలకు ఉమ్మడి జిల్లాలో గనుల శాఖకు పర్యవేక్షణ లేక, సిబ్బంది కొరతతో పట్టించుకోక రూ.3 కోట్లు కూడా వచ్చేది కాదు. కానీ సదరు ప్రైవేటు సంస్థ ఏకంగా ముక్కుపిండి నెలకు రూ.15కోట్ల వరకు పిండేసింది. ఇలా గతేడాది అసెంబ్లీ ఫలితాలు వచ్చేవరకు ఆడింది ఆట పాడింది పాట అన్నట్టు రెచ్చిపోయి ఉమ్మడి జిల్లాను కుమ్మేసింది. కోట్లకుకోట్ల సీనరేజీ పిండేసింది. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో ఈ సంస్థ ఆగడాలు ఆగినట్టేనని అంతా భావించారు. అప్పటి ప్రభుత్వం అడ్డగోలుగా కట్టబెట్టిన కాంట్రాక్ట రద్దవడం ఖాయం అని అనుకున్నారు. సుధాకర్ ఇన్‌ఫ్రా సైతం ప్రభుత్వం మారడంతో భయపడి తగ్గింది. మే, జూన్, జూలై నెలల్లో ఉమ్మడి జిల్లాలో సీనరేజీ వసూళ్ల నిలిపివేసింది. కానీ మళ్లీ అదే కంపెనీ పైరవీలు నడిపింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత మూడు నెలలపాటు సీనరేజీ వసూళ్ల నిలిపివేసినందున ఆ సమయానికి తమకు సీనరేజీ వసూలు చేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చింది. అటు ప్రభుత్వానికి సీనరేజీ బాకీలు కూడా ఉండడంతో అవి చెల్లించడానికి గడువు పొడిగించాలని కోరింది. ఈ నేపథ్యంలో ఈనెల నుంచి జూలై 14 వరకు 73 రోజులపాటు సీనరేజీ వసూలు చేసుకునేలా ప్రభుత్వం అనుమతిచ్చింది. జూలై 14 తర్వాత కాంట్రాక్టు రద్దవుతుందని స్పష్టంచేసింది.

గడువులోగా కుమ్మేద్దాం..

పొడిగించిన గడువు మరో రెండు నెలల్లో ముగియనుండడంతో సుధాకర్ ఇన్‌ఫ్రా ఇప్పుడు అడ్డగోలుగా కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో బరితెగించేస్తోంది. ఉన్న తక్కువ సమయంలో ఎక్కువ పిండేసేందుకు వీలుగా దౌర్జన్యాలకు తెగబడుతోంది. ఎక్కడికక్కడ కంపెనీ పేరుతో సిబ్బంది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వాహనాల్లో తిరుగుతూ డబ్బులు కట్టాలంటూ చెరువులు, కాలువలు, కొండలు, గుట్టల వద్ద దందాలు చేస్తున్నారు. చేతిలో కనీసం రసీదు పుస్తకం కూడా లేకుండా నగదు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రౌతులపూడిలో కొండల నుంచి గ్రావెల్ తరలిస్తోన్న లారీలను సుధాకర్ ఇన్‌ఫ్రా పేరుతో కొందరు ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. రసీదులు లేకుండా డబ్బులు అడుగుతున్నారని లారీ యూనియన్ తిరగబడడంతో అక్కడి నుంచి పరారయ్యారు. అలాగే కాకినాడ జిల్లా జగ్గంపేట, రౌతులపూడి, పెద్దాపురం మండలాల్లో చిన్నాచితకా క్వారీల నుంచి నల్లరాయి, గ్రావెల్, తూర్పుగోదావరిలో కొండల నుంచి చిన్నపాటి గ్రావెల్, మట్టి... కోనసీమలో చెరువుల నుంచి మట్టి తరలిస్తున్న వారిని సైతం వదలకుండా నగదు డిమాండ్ చేస్తుండడంతో సదరు కంపెనీ తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏమాత్రం బిల్లులు లేకుండా అడ్డదారిలో డబ్బులు వసూలు చేయడం ఏస్థాయిలో సీనరేజీ పేరుతో సదరు సంస్థ కోట్లకుకోట్లు దారిమళ్లిస్తుందోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటు రైతులు వాణిజ్యేతర అవసరాలు చెరువుల్లో మట్టి తవ్వి తరలించుకోవచ్చని ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయినా ఈ కంపెనీ మాత్రం తనకు డబ్బు కట్టాల్సిందేనంటూ బరి తెగించేస్తోంది.

ఆ రూ.24 కోట్ల పేరుతోను..

కాకినాడ జిల్లా రౌతులపూడి మండలంలో అరబిందో సంస్థకు గత వైసీపీ ప్రభుత్వం ఓ కొండను రాసిచ్చేసింది. కాకినాడ సెజ్‌లో నిర్మిస్తోన్న పోర్టు కోసం ఇక్కడి నుంచి కావలసినంత రాయిని తవ్వుకోవడానికి వీలుగా రూ.71 కోట్ల వరకు సీనరేజీ పన్ను రద్దు చేసేసింది. ఇలా చేయడం వల్ల తనకు రావలసిన ఆదాయానికి గండిపడిందని సదరు సుధాకర్ ఇన్‌ఫ్రా రూ.24కోట్ల వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బు చెల్లించలేదు. తాను కట్టాల్సిన బాకీలో ఈ మొత్తం రద్దు చేయాలని గత ప్రభుత్వాన్ని కోరింది. అయినా పట్టించుకోకపోవడంతో కొత్త ప్రభుత్వం వద్ద పైరవీలు చేసింది. వినకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అయితే ఈ మొత్తం డబ్బులు ఒకవేళ తాను కట్టాల్సివస్తే నష్టపోతామనే కారణంతో కాంట్రాక్టు మిగిలి ఉన్న ఈ రెండు నెలల్లో ఎంత వీలైతే అంత అడ్డగోలుగా పిండేయాలని సదరు సంస్థ పన్నాగం పన్నింది. అందుకే ఉమ్మడి జిల్లాల్లో సీనరేజీ పేరుతో నగదు వసూళ్లకు తెగబడుతోంది.

కోనసీమలోనూ అదే తీరు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సెస్ వసూలుకు వైసీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టు పొందిన సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థ పేరిట జరుగుతున్న దందా విమర్శలకు దారితీస్తోంది. ఇటీవల ఓ వివాదం పోలీసుస్టేషన్‌కూ చేరింది. పి.గన్నవరం మండలం నుంచి ఓ రైతుకు చెందిన పొలం నుంచి నల్లమట్టిని ట్రాక్టర్లపై అంబాజీపేట హైస్కూలుకు తరలిస్తుండగా వాటిని ఆపిన సుధాకర్ ఇన్‌ఫ్రా సిబ్బంది వారికి సొమ్ములు చెల్లించాలని డ్రైవర్లను అడిగారు. దాంతో డ్రైవర్లకు, సంస్థకు చెందిన వారికి మధ్య ఘర్షణ తలెత్తడంతోపాటు వారి ప్రైవేటు వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఆ ట్రాక్టర్ల డ్రైవర్లు, వాటి యజమానిపై పోలీసులు కేసు నమోదుచేశారు. దీంతో తమ పొలంలో మట్టి తీసుకుని తరలిస్తే సెస్ ఎందుకు చెల్లించాలని రైతులు నిలదీస్తున్నారు.



ఇందుగపల్లిలో శిథిలావస్థలో ఉన్న రామరాజు ఆయకట్టును పరిశీలిస్తున్న కలెక్టర్

ఖరీఫ్ నాటికి.. పూర్తిస్థాయిలో నీరందించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- కోటనందూరు మండలంలో పర్యటన

కోటనందూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలంలో దెబ్బతిన్న గ్రోయిన్స్‌ను ఆధునికీకరించి ఖరీఫ్ నాటికి పూర్తిస్థాయిలో నీరందించేందుకు చర్యలు చేపడుతామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కోటనందూరు మండలంలోని ఇండుగపల్లి, బిళ్లనందూరు, కోటనందూరు, అల్లిపూడిల్లో బుధవారం ఆయన పర్యటించారు. ముందుగా ఇండుగపల్లి శివారులోని రామరాజు ఆయకట్టును పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీరందించేలా చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బిళ్లనందూరు గ్రామంలో మినీగోకులం షెడ్లను పరిశీలించి బొండుగెడ్డను ఆధునికీకరించాలని రైతులు కోరారు. అనంతరం కోటనందూరులోని పోలీస్‌స్టేషన్, తహశీల్దార్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ఎంపీడీవో కార్యాలయాలను పరిశీలించారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్నారు. తాండవ వంతెనను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, గర్భిణుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అల్లిపూడిలోని పామాయిల్ తోటల గురించి ఉద్యానవనశాఖాధికారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరైతు ఉద్యాన పంటలు వేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్న దృష్ట్యా పంటలు వేసేలా ఉద్యాన అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ మండల చివరన ఉన్నా దృష్ట్యా అభివృద్ధిపథంలో నడిపించేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమం లో అధికారులు ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ శివాజీ, తహశీల్దార్ సుభాష్, ఎంపీడీవో వెంకటనారాయణ, ఏపీవో రాజగోపాల్ టీడీపీ, జనసేన నేతలు వెలగా వెంకటకృష్ణారావు, బైలపూడి శ్రీరామమూర్తి, గాదిరాము, సుర్ల అప్పలనాయుడు, అంకారెడ్డి రాజశేషు, అంకారెడ్డి రమణ పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ప్రారంభం

కాకినాడ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిణి(డీఐఈవో) ఐ.శారద తెలిపారు. జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించామన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగిన మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో గణితం-1ఏ, వృక్షశాస్త్రం-1, పౌరశాస్త్రం-1 పరీక్షకు 10,698 మంది హాజరుకావాల్సి ఉండగా 10,305మంది హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ పరీక్షలకు 452మందికిగాను 428మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటలవరకూ జరిగిన ఇంటర్ రెండోసంవత్సరం పరీక్షలకు జనరల్ విభాగంలో గణితం-2ఏ, వృక్షశాస్త్రం-2, పౌరశాస్త్రం-2 పరీక్షలకు మొత్తం 2048మంది హాజరుకావాల్సి ఉండగా 1962మంది హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్ విభాగంలో 231మందికిగాను 217మంది హాజరయ్యారన్నారు.

డీసెట్ దరఖాస్తు గడువు 20వరకూ పొడిగింపు

కాకినాడ రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణా సంస్థ(డైట్)ల్లో రెండేళ్ల డిప్లొమా కోర్సు డీసెట్-2025 ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 20వరకూ పొడిగించినట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https://cse. ap.gov.in, https://apdeecet.apcfss.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు పైన తెలిపిన వెబ్‌సైట్ నుంచి వివరాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

అర్జీలను గ్రీవెన్స్ అధికారి మాత్రమే పరిష్కరించాలి

- డీఆర్వో వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ/కాకినాడరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా వివిధ సమస్యల పరిష్కారంకోసం ప్రజల నుంచి అందిన అర్జీలను గ్రీవెన్స్ అధికారి మాత్రమే పరిష్కరించాలని డీఆర్వో జె.వెంకట్రావు ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్లో పీజీఆర్ఎస్ కార్యక్రమంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఆర్వో వెంకట్రావు, డీఎల్‌డీవో వాసుదేవరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణతలతో కలిసి గ్రీవెన్స్ దరఖాస్తుల సమస్యలను పరిష్కారంచేసే విధానంపై అవగాహన కల్పించి సూచనలు చేశారు. దరఖాస్తును చూసిన వెంటనే తమ శాఖకు సంబంధించినదైతే ఓకే చేయాలన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతీ అర్జీని నిర్దిష్ట కాలపరిమితిలోపు నాణ్యమైన సంతృప్తికరమైన పరిష్కారాలను అందించాలని డీఆర్వో ఆదేశించారు.

అప్‌గ్రేడ్!

- పంచాయతీరాజ్ విభాగంలో కీలక సంస్కరణల దిశగా అడుగులు
- గ్రామపంచాయతీల పునర్విభజన, నాలుగు గ్రేడ్‌లుగా వర్గీకరణ



జడ్పీ కార్యాలయంలో జేసీ రాహుల్ మీనా సమక్షంలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌కు హాజరైన కార్యదర్శులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పంచాయతీరాజ్ విభాగంలో కీలక సంస్కరణలకు కూటమి సర్కారు అడుగులు వేస్తోంది. గ్రామ పంచాయతీల పునర్విభజన, వర్గీకరణ దిశగా మార్పులు తీసుకురానుంది. గ్రామపంచాయతీల పునర్విభజన, తగిన సిబ్బంది నమూనా, సిఫారసుల కోసం కమిటీని ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్లు సమర్పించిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించింది. ఈ మేరకు పంచాయతీల పునర్విభజన, సిబ్బంది నమూనా కోసం మార్గదర్శకాలు జారీ చేసింది.

గ్రేడుల విభజన

పంచాయతీలు, వాటిలో పనిచేసే కార్యదర్శుల గ్రేడుల్లో మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటి వరకు నాలుగు గ్రేడులుగా ఉన్న పంచాయతీలను మూడుగ్రేడులుగా మార్చనుంది. అందులో రూ.కోటికిపైగా ఆదాయం కలిగిన, పదివేల జనాభా కలిగిన పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేయనుంది. ఈ పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో కేడర్‌లో పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వర్తించనున్నారు. రూ.50లక్షలనుంచి రూ.కోటి మధ్య ఆదాయం కలిగిన 4వేలనుంచి పదివేలు జనాభా కలిగిన పంచాయతీలను గ్రేడ్-1గా మార్చనున్నారు. 2వేల నుంచి 4వేలు జనాభా కలిగిన పంచాయతీలను గ్రేడ్-2, 2వేల కంటే తక్కువ జనాభా కలిగిన పంచాయతీలను గ్రేడ్-3 పంచాయతీలుగా గుర్తించనున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

పల్లె పాలనలో కీలకమైన పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు రానున్నాయి. ప్రస్తుతం పంచాయతీలు గ్రేడ్-1, 2, 3, 4 ఇలా నాలుగు గ్రేడులుగా ఉన్నాయి. వాటిలో పనిచేసే పంచాయతీ సెక్రటరీలు ఆరు గ్రేడులుగా ఉన్నారు. వీరిలో గ్రేడ్-6 కేటగిరీలో ఉన్న వారిని డిజిటల్ అసిస్టెంట్లుగా పిలుస్తారు. ఈ పోస్టును జగన్ సర్కారు హయాంలో సృష్టించారు. వీరిని కంప్యూటరైజ్డ్ ఉద్యోగిగా పరిగణిస్తారు. రాబోయే రోజుల్లో స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా అప్‌గ్రేడ్ కానున్న పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీ వోలు బాధ్యత వహించనున్నారు. ఈ పోస్టులు నేరుగా భర్తీచేయడమో లేక గ్రేడ్-1 కార్యదర్శులకు పదోన్నతి కల్పించడమో చేస్తారని సమాచారం. డీఎల్‌డీవోకు కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పించేలా ప్రభుత్వం మార్పులు తీసుకురానుంది.

స్పెషల్ గ్రేడ్ హోదాలోకి 31 పంచాయతీలు

పంచాయతీల పునర్విభజన, వర్గీకరణ అంశానికి సంబంధించి జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పంచాయతీలు, ప్రస్తుతం జిల్లాలో ఉన్న పంచాయతీ కార్యదర్శుల గ్రేడ్‌లు, సర్వీసులను పరిశీలించి, నివేదికను సిద్ధం చేశారు. కాకినాడ జిల్లాలోని మొత్తం 385 గ్రామ పంచాయతీల్లో 31 పంచాయతీలు స్పెషల్ గ్రేడ్ హోదాలోకి రానున్నాయి. గ్రేడ్-1 పంచాయతీలుగా 90, గ్రేడ్-2 పంచాయతీలుగా 152, గ్రేడ్-3 పంచాయతీలుగా 115 మారనున్నాయి. జిల్లాలోని గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించారు. వీరికి బదిలీల కౌన్సెలింగ్‌ను బుధవారం జడ్పీ కార్యాలయంలో జేసీ రాహుల్ మీనా సమక్షంలో నిర్వహించారు. 260మంది పంచాయతీ కార్యదర్శులకు వారు కోరుకున్న చోట బదిలీ చేయనున్నారు. ఈ కౌన్సెలింగ్ డీపీవో రవికుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు.

ఏపీపాలిసెట్ ఫలితాల్లో 94.06 శాతం ఉత్తీర్ణత

- శంఖవరం మండలం కొంతంగికి చెందిన బద్ది శశి వెంకట్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంకు

కాకినాడ రూరల్/శంఖవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-2025 ఫలితాల్లో జిల్లాలో 94.06శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గతనెల 30న జిల్లాలోని కాకినాడ, పిఠాపురంల్లో 28 కేంద్రాల్లో పాలిసెట్ ప్రవేశపరీక్షలను నిర్వహించారు. మొత్తం 8,849మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 8,371మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో బాలురు 5,212మందికిగాను 4,865మంది, బాలికలు 3,637కుగాను 3,506మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలోని శంఖవరం మండలం కొంతంగి గ్రామానికి చెందిన బద్ది శశివెంకట్ పాలిసెట్ ఫలితాల్లో 120కి 120 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. జిల్లాకు చెందిన కొప్పిశెట్టి అభిజిత్ రాష్ట్రస్థాయిలో 15వర్యాంకు, ఏటీవీవీ సత్య సూర్యతేజ 25వ ర్యాంకు, సీహెచ్‌కృష్ణరామవర్షిత్ 34వ ర్యాంకు సాధించారు.

పంచాయతీ వివరాలు సిద్ధం చేయాలి: డీపీవో



డిప్యూటీ ఎంపీడీవోలు, డీఎల్‌పీవోల సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

కార్పొరేషన్(కాకినాడ), మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల వివరాలు సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీల పునర్విభజనపై జిల్లా పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోలు, డీఎల్‌పీవోలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. వర్గీకరణసమీక్షకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ, గ్రామ పంచాయతీ పునర్విభజనపై సిఫార్సులు, తగిన సిబ్బంది ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామ పంచాయతీ సాధారణ ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని భవనాలు, లేఅవుట్ అనుమతులు, పట్టణ ప్రణాళిక, పారిశుధ్యం, మురుగునీటిని శుభ్రపరచడం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, రెవెన్యూ వసూలు, గ్రామ పంచాయతీ కార్యాలయ పరిపాలన వంటి గ్రామ పంచాయతీలు అందించే ప్రాథమిక సేవల ఆధారంగా ప్రతిపాదిత నాలుగు గ్రేడ్‌లకు ప్రతి గ్రామ పంచాయతీకి సిబ్బంది ప్రతిపాదనలు సిద్ధంచేసి 16 నాటికి ఇవ్వాలన్నారు.

సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

- నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- ప్రత్యేకాధికారిగా కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

సామర్లకోట, మే 14(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాలీటీలో వైసీపీ నుంచి ఎన్నికైన చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించేందుకు ఆ పార్టీయే ప్రయత్నిస్తోంది. ఇందుకు అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌కు 26మంది కౌన్సిలర్లు సంత కాలతో లేఖ అందించారు. సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జి.అరుణపై సొంతపార్టీకి చెందిన 26మంది కౌన్సిలర్లు తీవ్ర వ్యతిరేకతతో అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు లేఖ అందజేసిన నేపథ్యంలో ఈనెల 15న గురువారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించాల్సిందిగా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. సదరు సమావేశాన్ని నిర్వహించే ప్రత్యేకాధికారిగా కాకినాడ ఆర్డీవో మల్లిబాబును నియమిస్తూ కలెక్టర్ ఆదేశాల్లో పేర్కొన్నారు. దీంతో సమావేశం నిర్వహణకు సంబంధించి ప్రక్రియపై సమీక్షించేందుకు ఆర్డీవో మల్లిబాబు బుధవారం సామర్లకోట చేరుకుని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యతో సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వైసీపీ నాయకులతో చైర్‌పర్సన్ అరుణకు ఇటీవల కాలంలో సఖ్యత లేకపోవడంతో వైసీపీకి చెందిన అరుణపై సొంతపార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. 31మంది కౌన్సిలర్లకుగాను సొంత పార్టీనుంచి 26మంది సంతకాలతో అవిశ్వాసం వ్యక్తం చేస్తూ గతనెల 2న కలెక్టర్‌కు లేఖ అందజేశారు. కాగా, వైసీపీలో అంతర్గత విభేదాలను టీడీపీ నాయకులు మౌనంగా పరిశీలిస్తున్నారు.

ఇవి కాటేస్తే...



జంతువులు.. కీటకాలు.. విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. వాతావరణ మార్పులతో అప్పుడప్పుడూ వానలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పాములు, తేళ్లు, జర్రులతోపాటు పలు రకాలు విషపూర్తి కీటకాలు భూమిలోనుంచి జనావాసాల్లోకి వస్తుంటాయి. ఇవే కాక పెంపుడు కుక్కలు, వీధి కుక్కలు వంటివి ఒక్కోసారి ప్రమాదవశాత్తూ కరుస్తుంటాయి. ఇలా జంతువులు, కీటకాల కాట్లకు గురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రి సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. కుక్క కరిస్తే యాంటీ రేబిస్ ఇంజక్షన్, విషసర్పాలు కరిస్తే యాంటీ స్నేక్ వ్యాక్సిన్, తేళ్లు వంటివి కరిస్తే దానికి సంబంధించిన ఇంజక్షన్లు చేస్తారు. ఇంకా దీనికి సంబంధించిన వివరాలు తెలుసుకుందాం..

ప్రాణ సంకటమే!

- జంతువులు.. కీటకాలతో జాగ్రత్త అవసరం
- వేసవిలో వర్షాలు... జనావాసాల్లోకి విష సర్పాలు
- గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య మరీ ఎక్కువ
- కుక్కలతోనూ జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- విషపూరిత కీటకాలు కాటేస్తే తక్షణ వైద్యం అవసరం
- అందుబాటులో వైద్యం.. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం
- వెంటనే చికిత్స చేయించుకోవడం ఉత్తమం





జీజీహెచ్ (కాకినాడ)-ఆంధ్రజ్యోతి

శునకాలను చాలా మంది ఇళ్లల్లో ఇష్టంగా పెంచుకుంటూ ఉంటారు. ఒక్కోసారి అది కరిస్తే పెంపుడు జంతువే కదా అని అశ్రద్ధ చేస్తారు. అది హాని చేసినా పట్టించుకోకపోతే భారీ మూల్యం చెల్లించకతప్పదు. విషసర్పాలు కాటు వేసినా మా ఇలవేల్పే కదా అని నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణం మీదికి తెస్తుంది. వృశ్చికం (తేలు) పరిస్థితి కూడా అంతే. ఇకపోతే దోమే కదా అది కాటేస్తే ఏమౌతుందిలే అని తేలిగ్గా తీసిపారేస్తాం. కానీ ఇవే చాప కింద నీరులా విషజ్వరాలుగా మారి ప్రాణాల మీదికి తెస్తుంది. మనిషి ఇన్ని ప్రాణాపాయాల నుంచి బయట పడాలంటే ప్రాథమిక దశలో తీసుకునే వైద్యుల సలహాలు, సూచనలే శ్రీరామరక్షగా ఉంటాయి.

● పాముకాటు వేస్తే..



అని పాములు విషపూరితమైనవి కావు. విషసర్పం కాటు వేస్తే శరీరంపై కాటు గుర్తులు పడతాయి. అక్కడ వాపు లేదా రక్తస్రావం జరగొచ్చు. విషం శరీరంలోకి మెల్లగా పాకే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వస్తాయి. వికారం, వాంతులు, తలనొప్పి, అస్పష్టమైన దృష్టి, కండరాల బలహీనత వంటివి జరిగే అవకాశం ఉంటుంది. పాము కాటు వేసిన తర్వాత తొందరలో కొన్ని పొరపాట్లు చేయకూడదు. కాటు వేసిన ప్రాంతాన్ని కడగకూడదు. రక్తప్రవాహాన్ని ఆపడానికి కట్లు కట్టడం వంటివి చేయకూడదు. విషం పీల్చడానికి ప్రయత్నించవద్దు. బాధితుడిని ఆందోళన చెందనివ్వరాదు. ఎటువంటి మంత్రానికి తీసుకుని వెళ్లరాదు. వెంటనే దగ్గరలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా అర్హుడైన వైద్యుడి వద్దకు తీసుకువెళ్లాలి. వీలైతే కాటువేసిన పాము జాతి లేదా ఏ రంగులో ఉందో వైద్యులకు తెలియజేయాలి. వైద్యపరీక్షల అనంతరం పాము ద్వారా ఎక్కిన విషాన్ని బట్టి అక్కడ వైద్యులు పెద్దాస్పత్రికి సిఫార్సు చేస్తారు. తద్వారా శరీరంలో ఎక్కిన విషాన్ని బట్టి యాంటీ స్నేక్ వేనం (ఏఎస్‌వీ) వ్యాక్సిన్‌ను వైద్యుల పర్యవేక్షణలో ఇస్తారు.

● ప్రమాదకరం పాముకాట్లు

వేసవికాలమైనా ఇప్పుడు కూడా ఒక్కోసారి వర్షాలు పడుతున్నాయి. పొలాల్లో రైతులు, రైతు కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే అప్రమత్తంగా లేనివారు పాము కాట్లకు గురైన కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. పొలం పనులతోపాటు గ్రామీణ ప్రాంతంలో పాత నివాసగృహాలు, పరిసరాలు శుభ్రత పాటించలేని ఇళ్లవద్ద జనం పాముకాట్లకు గురైన మృతి చెందిన సంఘటనలున్నాయి. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాముకాట్లకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నా సకాలంలో సరైన వైద్యం అందక ఏదో ఒకచోట పాముకాటుకు గురై ఎవరో ఒకరు మృతి చెందుతూనే ఉన్నారు.

● రెండు రకాల విషసర్పాలు

పాములు రెండు రకాలు ఉండగా న్యూరోటాక్సిల్ రకం.. నాగుపాము, కట్ల పాము.. రెండో రకం హెమోటాక్సిన్ అంటే రక్తపింజర వంటి పాములు ఉన్నాయి. న్యూరోటాక్సిల్‌తో నోటి ద్వారా నురగు వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంది. ఇది గుండెపై ప్రభావం చూపి నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. హిమోటాక్సిల్‌తో క్షణాల్లో కణజాలం నశించి కాటుపడిన భాగంలో వాపు వస్తుంది. ఎలాంటి పాము అని తెలుసుకుంటే చికిత్స చాలా సులభంగా ఉంటుందని వైద్యులు చెప్తున్నారు. పక్కపక్కనే రెండు దంతాల కాట్లు కనిపిస్తే ఇక అది కచ్చితంగా విషపురుగే. ఎలాంటి పాము కాటేసినా ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందే.

● ధైర్యమే రక్ష

సాధ్యమైనంత వరకు పాములు, విషకీటకాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి పూట పొలాలకు వెళ్లే వారు కర్ర, టార్చ్‌లైటు తీసుకెళ్లాలి. ఇంటి ఆవరణంలో ముళ్లపొదలు, రంధ్రాలు, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలి. ఒకవేళ పాముకాటుకు గురైనప్పుడు ఆందోళనకు గురి కాకూడదు, ఆ ప్రమాదం గుండెపోటుకు దారితీస్తుంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చిక్సితలు చేయించాలి. పాము కరిచిన వారిలో ఎక్కువ శాతం భయందోళనకు గురై మరణించే అవకాశం ఉంది. వారికి ధైర్యం చెప్పి వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. పాము కరిచిన వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లితే 99 శాతం బతికే అవకాశం ఉందని, పాము ఎలాంటిదైనా చికిత్సలు చేయిస్తేనే ప్రాణాలు పదిలం అంటున్నారు వైద్యులు. ప్రతిఏటా పాము కాట్లకు గురవుతున్న వారిలో 80 శాతంపైగా ప్రాణాలు పోగొట్టుకుటుంటున్నది గ్రామీణులే అని వైద్యులు చెబుతున్నారు.

● మందులు ఉన్నాయి

పాము కాటుకు సంబంధించి మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. పాముకాటుకు గురైన వెంటనే సకాలంలో ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకువచ్చి(యాంటీ స్నేక్ వీనం) ఇంజక్షన్లు వేయించుకోవాలి. మూఢనమ్మకాలు, నాటువైద్యం నమ్మకుండా దగ్గర్లోని పీహెచ్‌సీకి తీసుకెళ్లి వైద్యం చేయించుకోవాలి. ప్రధానంగా రైతు, రైతు కూలీలు పొలాలకు వెళ్లేటప్పుడు, ఇండ్ల వద్ద తగు జాగ్రత్తలు తీసుకుంటే పాముకాటు నుంచి రక్షణ చేసుకోవచ్చు.

● కుక్క కాటుకు..

ప్రమాదవశాత్తూ కుక్క కరిస్తే పెంపుడు కుక్కే కదా అని అశ్రద్ధ చేయకూడదు. పెద్ద గాయం లేదా ముఖానికి దగ్గరగా గాయమైనా దగ్గరలోని పీహెచ్‌సీ లేదా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్తే అక్కడ ఇమ్యునో గ్లోబ్యూలిన్స్ గాయం చుట్టూ ఇచ్చి అనంతరం టీటీ ఇంజక్షన్ ఇస్తారు. అనంతరం నాలుగు దఫాలుగా యాంటీ రేబిస్ (ఏఆర్‌వీ) వ్యాక్సిన్‌ను క్రమం తప్పకుండా వేయించుకోవాలి. కొన్ని రకాల ఆహారాలు తీసుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అలా కాకుండా నిర్లక్ష్యం చేసి వ్యాక్సిన్ వేయించుకోకుండా ఉంటే రేబిస్‌కు గురై మరణించే అవకాశం ఉంటుంది.

● దోమలు ప్రమాదమే...



ఇక అతి ముఖ్యమైనది రకరకాల దోమ జాతులు వానాకాలం, శీతాకాలంలో వృద్ధి చెంది అవి కుట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా తదితర విష జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. వాటిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుంది.

● తేలు కరిస్తే...



చిన్నచిన్న తేళ్ల వల్ల పెద్దగా ప్రమాదం ఉండదు. అదే పెద్ద తేలు కుడితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉన్న వైద్యుడ్ని సంప్రదించాలి. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఆయన సిఫార్సు మేరకు పెద్దాసుపత్రిలో చేరడం ద్వారా మెరుగైన చికిత్స అంది ప్రాణాపాయం తప్పుతుంది.

అల్లూరి పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

● కంబాలచెరువు వద్ద సీతారామరాజు విగ్రహాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరంలోని కంబాల చెరువు వద్ద ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు, మన్యం వీరుల విగ్రహాల సముదాయం

రాజమహేంద్రవరంసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన వీరోచిత పోరాటం భవిష్యత్‌తరాలకు స్ఫూర్తిదాయకమని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం కంబాలచెరువుచిరంజీవి పార్కును రూ.కోటీ 25లక్షలతో అభివృద్ధిచేసి అక్కడ ఏర్పాటుచేసిన అల్లూరి సీతారామరాజు, ఆయన అనుచరులు మన్యంవీరుల విగ్రహాలను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, కూటమి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుతో రాజమహేంద్రవరానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. ఈ ప్రాంతాలలో ఆయన సంచరించారని గుర్తుచేశారు. అటువంటి పోరాటయోధుల విగ్రహాలను చూసి భవిష్యత్‌తరాలు స్ఫూర్తినొందాలని మన్యం వీరుల విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.75లక్షలు, రూడా నుంచి మ్యాచింగ్ ఫండ్స్ రూ.50లక్షలు కలిపి మొత్తం రూకోటి 25లక్షలతో పార్కు అభివృద్ధి చేశామన్నారు. చిరంజీవి పార్కుకు చరిత్ర ఉందన్నారు. గతంలో ఈ పార్కును అప్పటి కేంద్ర మంత్రి చిరంజీవి ప్రారంభించాల్సివుండగా కొన్ని అనివార్యకారణాల వల్ల పార్కు ప్రారంభం కాలేదన్నారు. అప్పటి నుంచి ఈపార్కు బాగోగులు చిరంజీవి అభిమానులే చూస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పార్కును అభివృద్ధి చేశామన్నారు. అదేవిధంగా అమృత పథకం 2.0లో కేంద్రం రాష్ట్రానికి రూ.10వేల కోట్లు గ్రాంటు కేటాయించిందని అందులో రాజమహేంద్రవరానికి రూ.200 కోట్లు కేటాయించిందని, ఇది శుభపరిణామమన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడిన యోధుడు అల్లూరి అని అన్నారు. అల్లూరి సీతారామరాజు తోపాటు మన్యంవీరుల విగ్రహాలను ఇక్కడ ఏర్పాటుచేయడం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరీకరణ అనేది చాలా వేగంగా జరుగుతుందన్నారు. పట్టణాలకు పల్లె ప్రాంతాల నుంచి ప్రజలు నివాసానికి వస్తున్న తరుణంలో పార్కులను, స్పోర్ట్స్‌కు సంబంధించిన ఇన్‌ఫ్రాస్టక్చర్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా రుడా, నగరపాలక సంస్థ అథారిటీ వారికి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ క్రమంలోనే చిరంజీవి పేరున ఉన్న పార్కును ప్రారంభించామన్నారు. జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను మాట్లాడుతూ 2002లో మెగాస్టార్ చిరంజీవి ఇదే పార్కులో ప్రస్తుతం ఉన్న మదర్ థెరిస్సా విగ్రహాన్ని ఆవిష్కరించలేని విధంగా అభిమానులు కిక్కిరిశారని ఆనాటి రోజును గుర్తుచేశారు..

ప్రాథమిక హక్కుల పరిరక్షణే కమిషన్ ధ్యేయం

● ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయాని



అధికారులతో చర్చిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయ భారతి సయాని

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను అందించడంలో ప్రభుత్వశాఖలు వివక్ష ధోరణి చూపుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నామని. ప్రజలు ఆ హక్కులను పొందేవిధంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) కృషి చేస్తోందని కమిషన్ సభ్యురాలు విజయభారతి సయాని పేర్కొన్నారు. రెండురోజుల జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి ఆమె రాజమహేంద్రవరం చేరుకున్నారు. బుధవారం ఉదయం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మానవహక్కుల విషయంలో ఉల్లంఘన జరిగితే ఎన్‌హెచ్ ఆర్‌సీకి ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పౌరుల ఇబ్బందులపై కేసులను సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తామన్నారు. ప్రజలకు ప్రభుత్వం అందించాల్సిన సేవల లోపాల విషయంలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు. ఇప్పటివరకూ 39 గిరిజన వసతిగృహాలు, ఎస్సీ కాలనీలు, పాఠశాలలు, మండల తహ శీల్దారు కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలుచేసి పౌరుల సమస్యలు తెలుసుకున్నామని, వాటిపై కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. పింఛన్లు అందక ఇబ్బంది పడుతున్న అర్హులకు కూడా పరిష్కారం చూపుతామన్నారు. మహిళల గౌరవానికి, భద్రతకు భంగం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆమె చెప్పారు. మహిళల చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించే విషయంలో ప్రభుత్వ అధికారులు స్పందించకపోతే నేరుగా కమిషన్‌కి అర్జీ పెట్టుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ స్వయం ప్రతిపత్తి కలిగి ఉంటుందని, ఏ రాష్ట్రంలోనూ అనుబంధ సంఘాలు లేవని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లోని కమిషన్ వెబ్‌సైటు nhrc.netలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. తొలుతగా జిల్లా అధికారులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలతో ఆమె బుధవారం రాత్రి సమావేశమయ్యారు. వారి సమస్యలు, నిర్వహణ, విధుల్లో ఇబ్బందులు, బలహీనవర్గాల సమస్యలు, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ప్రజల స్థితిగతులపై చర్చించారు. అధికారులకు తెలియజేసి సమస్యలకు పరిష్కారం చూపుతామని అంగన్వాడీ కార్యకర్తలతో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి పేర్కొన్నారు.



ఐదో యూనిట్‌లో టర్బన్ పనులు, కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం

రూ.510 కోట్లు 2 యూనిట్లు

పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో శరవేగంగా 5, 6 యూనిట్ల పనులు



మోతుగూడెం, మే 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం పరిధి సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో రూ.510 కోట్లతో 5,6 యూనిట్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తొలుత వీటిని మే నెలాఖరుకు పూర్తి చేయాలనుకన్నా కొన్ని కారణాల వల్ల మరో ఆరు నెలలు (నవంబరు వరకు) పొడిగించినట్టు సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ స్వామినాయుడు తెలిపారు. ఈ యూనిట్లకు సంబంధించి సివిల్ మేజర్ పనులు పూర్తయ్యాయని, మిగిలినవి కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆ రెండు యూనిట్లకు నీటిని సరఫరా చేసే మూడో పెన్‌స్టాక్ పైపులైన్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులు సైతం శరవేగంగా సాగుతున్నాయి. సీఈ స్వామినాయడు, ఇతర ఉన్నతాధికారులు వీటిని పరిశీలిస్తున్నారు. కాంట్రాక్టర్లు నవంబరు నెలాఖరుకు పనులు పూర్తి చేసి జెన్‌కోకు అప్పగిస్తే పొల్లూరు జల విద్యుత్ కేంద్రం 690 మెగావాట్లతో అధిక ఉత్పత్తి కేంద్రంగా నిలుస్తుందని సీఈ వివరించారు.

లక్ష్యాలు స్వల్పంగా పెంపు

రాష్ట్రంలో జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి సంబంధించి కేంద్ర విద్యుత్ అథారిటీ (సీఈఏ) లక్ష్యాలు నిర్దేశిస్తోందని సీఈ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌కు 2286 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా విధించారు. మార్చి నెలాఖరుకు నాలుగు జల విద్యుత్ కేంద్రాలు (పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్) ద్వారా 2,454 మిలియన్ యూనిట్ల మేర ఉత్పత్తి జరిగింది. లక్ష్యం కంటే 168 మిలియన్ యూనిట్లు అదనంగా ఉత్పత్తి చేశామన్నారు. దీంతో కేంద్ర విద్యుత్ అథారిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సీలేరు కాంప్లెక్స్‌లోని నాలుగు కేంద్రాల లక్ష్యాలను గతేడాది కంటే 28 మిలియన్ యూనిట్లు పెంచింది. ఈ ఏడాది సీలేరు కాంపెక్స్ లక్ష్యం 2314 మిలియన్ యూనిట్లు సాధించేలా కృషి చేస్తామని సీఈ వివరించారు.



ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ సమక్షంలో ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న నన్నయ విశ్వవిద్యాలయం, టీఐకేఎం అధికారులు

శ్రీలంక సంస్థతో సంయుక్త పరిశోధనకు 'నన్నయ' అవగాహన ఒప్పందం

దివాన్‌చెరువు, మే 14 (ఆంధ్రజ్యోతి) అంతర్జాతీయ సంస్థతో చేసుకున్న ఎంవోయూ ద్వారా సంయుక్త పరిశోధనకు, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ వంటి పలు అంశాల్లో పరస్పర సహకారం లభిస్తుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పేర్కొన్నారు. శ్రీలంకకు చెందిన ది ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్మెంట్ (టీఐ ఐకేఎం)తో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా బుధవారం విశ్వవిద్యాలయం ఈసీ హాల్లో జరిగిన సమావేశానికి వీసీ ప్రసన్నశ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, టీఐఐకేఎం సహ వ్యవస్థాపకుడు ఇసాంక పి గమగే ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి వీసీ సమక్షంలో మార్చుకున్నారు. ప్రసన్నశ్రీ మాట్లాడుతూ తాను వీసీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంతర్జాతీయ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. దీని ద్వారా జాయింట్ కాన్ఫరెన్స్‌లు, వెబినార్లు, వర్క్‌షాప్‌లు, శిక్షణ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్, డిగ్రీ కార్యక్రమాలు, కమ్యూనిటీ సర్వీసెస్, పబ్లికేషన్ సపోర్ట్ సర్వీసెస్ వంటి వాటికి పరస్పరం సహకారం లభిస్తుంద న్నారు. భవిష్యత్తులో అధ్యాపకులు, విద్యార్థులు లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ వి.పెర్సిస్, శ్రీలంక శ్రీజయవర్ధనేపుర విశ్వవిద్యాలయం పాలీ, బౌద్ధ అధ్యయనాల విభాగా నికి చెందిన మొరవాక ధమ్మరఖిత థెరో, ప్రొఫెసర్ నిమాలి తక్షితలా వితనాగే తదితరులు పాల్గొన్నారు.



అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్ల క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఉమ్మడి' జిల్లా జట్ల పయనం

పిఠాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాల, బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్లు బుధవారం పిఠాపురం నుంచి పయనమయ్యాయి. వీరికి గత నాలుగు రోజులుగా పిఠాపురంలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో శిక్షణ ఇచ్చారు. క్రీడాకారులకు పిఠాపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, జనసేన నాయకులు కొత్తపల్లి బుజ్జి, బొజ్జా కుమార్, పల్నాటి మధు, జాన్, బాబీ క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు (అయలు) తదితరులు పాల్గొన్నారు.



మేమూ అవుతాం బీచ్‌లో చిల్

ప్రస్తుతం ఎండలకు మనుషులే విలవిల్లాడుతున్నారు. అలాంటిది మూగజీవాలు పరిస్థితి ఏంటో ప్రత్యేకంగా చెప్పాలిన పనే లేదు. ఎప్పుడూ సందర్శకులతో ఉండే కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో బుధవారం ఇదిలో ఇలా గేదెల గుంపు అతిథుల్లాగా వచ్చి కాసింతసేపు సేదతీరింది.

ఫొటోగ్రాఫర్- కాకినాడ



నేనున్నానని..నీకేం కాదని...

ఎన్నో ఏళ్లు వయసు ఉన్న వృక్షం మరణిస్తే అందులో నుంచి నేను ఉన్నానంటూ నిర్జీవ వృక్షాన్ని ఆసరా చేసుకుని కొత్త వృక్షం పునరుజ్జీవంతో పర్యావరణ హితానికి అడుగులు వేస్తోంది. రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్‌లో మూడోవ రైలు బ్రిడ్జికి సమీపంలో పూర్తిగా ఎండిపోయిన నిద్రగన్నేరు చెట్టును అనుకుని మరిచెట్టు మహావృక్షంగా మారేందుకు పాత వృక్షాన్ని ఆసరగా చేసుకుని పచ్చదనాన్ని అందిస్తోంది

ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం

యువత... జాగ్రత్త!



- వేసవిలో జలకాలాటలకు దిగుతున్న యువకులు, విద్యార్థులు
- గల్లంతవుతున్న ఘటనలు
- కాలువ గట్లకు తూట్లతో ప్రమాదాలు

ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే చాలు యువత కాలువ గట్ల వద్ద వాలిపోతుంటారు. సరదగా స్నానాలు చేద్దామని స్నేహితులతో కలిసి వెళ్తుంటారు. అది వినోదమే కానీ దాని వెనుక ప్రమాదం దాగి ఉందనే సంగతి మరిచిపోతున్నారు. ఫలితంగా గల్లంతుకావడం, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడం వంటి సంఘటనలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరుగుతు న్నాయి. ముఖ్యంగా కాకినాడ జిల్లాలో ఏలేశ్వరం నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువ ప్రమాద భరితంగా మారింది. ఈ కాలువకు నియోజకవర్గంలోని పెదశంకర్లపూడి, రౌతు పాలెం, పెద్దిపాలెం, పొదురుపాక, గజ్జనపూడి, చింతలూరు, యుజేపురం, జి.కొత్తపల్లి తదితర గ్రామాల వద్ద రెండు వైపుల ఉన్న గట్లు దారుణంగా దెబ్బతిన్నాయి. వర్షాలు కురిసిన సమయంలో ఈ గట్లు కోతకు గురి కావడం వల్ల కాలువ వెంబడి ఉన్న గ్రామాల్లో ఉన్న యువకులు, విద్యార్థులు కోతకు గురైన గట్ల వద్ద కాలువలోకి దిగి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. రెండు రోజుల క్రితం పెదశంకర్లపూడిలోని ఏలేరు కాలువలో నలుగురు విద్యార్థులు స్నానానికి దిగిన సంఘటనలో ఒక విద్యార్థి మరణించాడు. కాలువ గట్ల పటిష్టతకు ఏలేరు ఎడమ కాలువ అధికారులు చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ విద్యార్థులు, యువకులు వేసవిలో కాలువలో జలకలాడేందుకు ఆసక్తి చూపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువ గట్ల వద్ద పహరా ఉంచడంతో పాటు యువత జాగ్రత్తగా ఉంటే కొంతవరకు ప్రమాదాలు నివారణ సాధ్యపడేవని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పెదశంకర్లపూడిలో ప్రమాదకరంగా మారిన ఏలేరు ఎడమ కాలువ గట్టు

పదో తరగతిలో అడుగుపెట్టకుండానే ప్రాణాలు వదిలి..

- ఏలేరు కాలువలో గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



విఘ్నేష్ మృతదేహం



మృతదేహాన్ని కాలువలో వెలికితీస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలోని ఏలేరు కాలువలో గల్లంతైన 9వ తరగతి విద్యార్థి విఘ్నేష్ (14)మృతదేహం బుధవారం లభ్యమైంది. పెదశంకర్లపూడికి చెందిన నలుగురు విద్యార్థులు సరదగా ఏలేరు ఎడమ కాలువలో స్నానానికి దిగి ప్రమాదానికి గురైన ఘటనలో పంది వీర వెంకట సత్యనారాయణ విఘ్నేష్ గల్లంతై మిగిలిన ముగ్గురు సురక్షితంగా బయటపడిన విషయం తెలిసిందే. గల్లంతైన విద్యార్థి విఘ్నేష్ కోసం బుధవారం ఉదయం గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని గుర్తించారు. కాలువ అడుగుభాగంలో చిక్కుకుపోయిన విఘ్నేష్ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు విఘ్నేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. లంపకలోవ జిల్లా పరిషత్ హైస్కూల్లో 9వ తరగతి పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరంలో పదో తరగతి చదవాల్సిన తమ కుమారుడు ఏలేరు కాలువ పడి మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. చేతికందివచ్చే బిడ్డ ఏలేరు కాలువకు బలి కావడం జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

రైల్వే స్టేషన్‌లో...

బ్యాటరీ కారు ఢీకొని లోకో పైలట్‌కి గాయాలు



ఆస్పత్రిలో రామారావు

రాజమహేంద్రవరం, మే 14(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సదుపాయం కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీ కార్ ఢీకొని లోకో పైలట్ గాయాల పాలయ్యాడు. ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో బుధవారం ఉదయం 7గంటల ప్రాంతంలో లోకోపైలట్‌గా పనిచేస్తున్న రాజమండ్రి లలితానగర్‌కి చెందిన రామారావు విధుల ముగించుకుని రెండో ప్లాట్‌ఫాం నుంచి ద్విచక్రవాహనం తీసుకుందామని వస్తున్నాడు. ఈలోపు మూడో ప్లాట్‌ఫాం నుంచి వస్తున్న బ్యాటరీ కారు ఢీకొంది. దీంతో ఆయన కుడి కాలు ఎముకకు గాయమైంది. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని ఎస్‌ఐ లోవరాజు తెలిపారు. అయితే ఇక్కడ ప్లాట్‌ఫాంలు రద్దీ సమయంలో ఇరుగ్గా ఉండడంతో ఇబ్బంది ఏర్పడుతోంది. 2,3,4 ప్లాట్‌ఫాంల నుంచి మెయిన్ గేటు వైపునకు ప్రయాణికులను తీసుకురావాలంటే కచ్చితం గా ఆ ప్లాట్‌ఫాంల చివరన రైలు ట్రాకులు దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రైలు వెళ్లే సమయంలో బ్యాటరీ కారుకు పొరబాటున బ్రేకులు పడకపోతే ప్రమాదం ఊహించని విధంగా ఉంటుందని ప్రయాణికులు వాపో తున్నారు. విజయవాడ మాదిరిగా ఇక్కడ ప్రస్తుతం బ్యాటరీ కారు నడపడానికి భద్రతాపరంగా అనుకూలం కాదని.. ఓ వైపు కుక్కలు, మరో వైపు బ్యాటరీ కారుతో రద్దీ సమయంలో గందరగోళానికి గురవుతున్నామని చెప్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తుని రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కాకినాడ జిల్లా తుని పట్టణం బాలయోగి మెట్ట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతిచెందిన వ్యక్తి శరీరం గుర్తుపట్టలేనంతగా మారడంతో వివరాలు కానరాలేదన్నారు. శవాన్ని ఏరియా ఆసుపత్రిలో మృతదేహం భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

అన్నవరం దేవస్థానం

మాస్టర్‌ప్లాన్‌ను పునఃపరిశీలన చేయాలి

- దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశాలు
- ప్రసాద్ స్కీం పనులకు మరోసారి టెండర్లు
- విష్ణుసదన్ సత్రం వద్ద నూతనంగా నిర్మించదలిచిన ప్రదేశానికి స్థల పరిశీలన

అన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి ఏటేటా పెరుగుతన్న భక్తుల తాకిడికి అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి పాత మాస్టర్‌ప్లాన్‌ను రివైజ్డ్ చేయాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహ న్ ఆదేశించారు. బుధవారం అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో విజయవాడ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న మాస్టర్‌ప్లాన్ 2019లో అప్రూవల్ కాగా దానికి విరుద్ధంగా పలు నిర్మాణాలను చేపట్టాల్సి వచ్చింది. దీంతో రివైజ్డ్ చేయాలని ఏమేమి నిర్మించాలి, ఎక్కడ నిర్మించాలి అనే అంశాలపై నూతన మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. సీతారామసత్రం కూల్చివేత, విష్ణసదన్ ఎదురు గా నూతనంగా నిర్మించతలపెట్టిన 128 గదుల సత్రాన్ని దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ స్థల పరిశీలన చేయాలని సూచించారు. ప్రసాద్ స్కీం పనులకు మరోసారి టెండర్లు పిలవడం జరుగుతుందని సూత్రప్రాయంగా తెలిపారు. దేవదాయ కమిషనర్ గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉండడంతో ఆయన పలు సూచనలు చేశారు. సమావేశానికి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, నూకరత్నం, డీఈలు రాంబాబు,ఉదయ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

'ఏలేరు'లో భారీగా తగ్గిన నీటి నిల్వలు

ఏలేశ్వరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కాకినాడ జిల్లా ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు భారీగా తగ్గుతున్నాయి. ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్న ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజక వర్గాల పరిధిలో సుమారు 60వేల ఎకరాలు వ్యవసాయ భూములున్నాయి. సాగుకు పూర్తిగా సరఫరా నిలిపి వేసి విశాఖ మహానగరం అవసరాలకు జలాలను సరఫరా చేస్తున్నారు. దీంతో ఏలేరులోని దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా శనివారం 76.51 మీటర్లుగా నమోదైంది. పూర్తిస్థాయి నిల్వల సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.71 టీఎంసీల మేర మాత్రమే నీటి నిల్వలున్నాయి.

అడుగంటిన తిమ్మరాజు చెరువు

ప్రస్తుతం విశాఖకు 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఏలేశ్వరం గ్రామీణ మండలాల్లో ఏలేరు జలాలనే శుద్ధి చేసి తాగునీటిగా అందిస్తున్నారు. పశువుల తాగునీటి అవసరాలకు కాలువలకు అ ప్పుడప్పుడు నీటిని విడుదల చేస్తారు. ఎండలు మరింత అధికమైతే నీరు ఆవిరి అయిపోవడంతో నిల్వలపై ప్రభావం చూపుతోంది.



ఏలేరు జలాశయంలో తగ్గిన నీటి మట్టం

ఖరీఫ్ సాగుపై రైతుల ఆందోళన

ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాలకు సాగునీరందించే తిమ్మరాజు చెరువు అడుగంటడంతో ఖరీఫ్ సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏలేరు జలాశయం నుంచి సుమారు 50 నుంచి 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. దీనిలో అర టీఎంసీ నీరు నిల్వ ఉంటుంది. చెరవు నుంచి వచ్చే నీటి ద్వారా సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందిచవచ్చు. కానీ పొలాలకు నీరందించే కాలువలో పూడిక, తుప్పలు తొలగించకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లోను, ఇళ్ల మధ్యలోను ఎక్కడిక్కడ నీరు ఉండిపోవడంతో చెరువులోని నీరు పొలాలకు చేరకుండా మధ్యలో ఆగిపోతుంది. ఖరీఫ్ సాగు ముందు కాలువలను శుభ్రం చేసి పొలాలకు నీరందేలా తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అడుగంటిన తిమ్మరాజు చెరువు దృశ్యం

ఏపీ పాలిసెట్‌లో 'తిరుమల' విద్యార్థుల ప్రతిభ

అభినందనలు తెలిపిన చైర్మన్

రాజమహేంద్రవరంరూరల్ మే 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గల తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. 120 మార్కులకుగాను 120 మార్కులు ఆరుగురు విద్యార్థులు బాలినేని కళ్యాణ్‌రామ్, ఊన్న వరుణ్ తేజ్, ఆకుల నిరంజన్, శ్రీరామ్, బల్లా రిషీత, వి.స్వప్న, రూపిటి చన్నా, పాల రోహన్ సాధించారు. 119 మార్కులు 13 మంది విద్యార్థులు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ తిరుమల రావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 2, 5, 7, 10, 11, 12 ర్యాంకులు సాధించడంతో పాటు 50 లోపు 14మంది, 100లోపు 23 మంది, 500 లోపు 79మంది విద్యార్థులు సాధించారన్నారు. ర్యాంకుల సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్స్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

రెండు లారీలు ఎదురెదురుగా ఢీ

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

కొవ్వూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొని డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరిగింది. బుధవారం ఆరికిరేవుల గ్రామదేవత పాశాలమ్మ ఆలయ సమీపంలో గోదావరి గట్టుపై కొవ్వూరు వైపు నుంచి తాళ్ళపూడి వెళ్తున్న ఇసుకలోడ్ టిప్పర్ లారీ, తాళ్లపూడి నుంచి కొవ్వూరు వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌కి స్వల్పగాయాలు కాగా ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో కొవ్వూరు తాళ్ళపూడి గోదావరి ఏటిగట్టు రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఆరికిరేవుల జాతర బందోబస్తు నిర్వహిస్తున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను ఆరికిరేవుల గ్రామంలోంచి బయటకు మళ్లించారు. పోలీసు, ఫైర్ అధికారులు, జేసీబీ సహాయంతో లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయపడిన ఇద్దరు డ్రైవర్లను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం, సంఘటనా స్థలంలో లారీలు

మహిళపై హత్యాయత్నం

- 16 గంటలు అచేతనస్థితిలో
- తుప్పల్లో ఉండిపోయిన వైనం

అమలాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరంలోని సడక్ రోడ్డులో ఓ మహిళ తుప్పల్లో పడి ఉండడాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను 108లో అమలాపురం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లవరం మండలం మొల్లేటిమెరకకు చెందిన మంగాదేవి(30) స్థానిక సడక్ రోడ్డులో గల తుప్పల్లో పడి ఉండడాన్ని బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 16గంటల పాటు తుప్పల్లో ఆమె అచేతన స్థితిలో ఉంది. పోలీసులు ఆమెను అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గోసంగివారిపేటకు చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి తనను తీసుకెళ్లి దాడి చేసి హత్యాయత్నం చేసినట్టు ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చిన మహిళ పోలీసులకు తెలిపింది. అల్లవరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె జీజీహెచ్‌లో చికిత్స పొందుతుంది.

జేసీబీ, లారీ సీజ్

రౌతులపూడి, మే 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మూలగపూడి సర్వేనెంబర్1లో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్ అధికారులు దాడులు చేసి జేసీబీ, లారీ సీజ్ చేసినట్టు టెక్నికల్ అసిస్టెంట్ తేజ తెలిపారు. సర్వే నిమిత్తం రాగా అక్రమ గ్రావెల్‌ను గుర్తించామన్నారు. క్రషర్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న కే.అరుణ్‌కుమార్‌కు చెందిన వాహనాలను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించామని ఆయన చెప్పారు.

కనుల పండువగా భావనారాయణస్వామి తెప్పోత్సవం

సర్పవరం జంక్షన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఎనిమిది రోజులుగా శోభాయమానంగా జరుగుతున్నాయి. ముగింపు వేడుకల్లో భాగంగా బుధవారం ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆలయం ఎదురుగా గల ముక్తికా సరస్సులో తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన తెప్ప (హంస వాహనం)పై స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో విహరిస్తుండగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించి పులకించారు. తొలిసారిగా తెప్పోత్సవం నిర్వహించిన ఎమ్మెల్యే పంతం నానాజీ, ఈవో లక్ష్మీనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





సర్పవరంలో హంస వాహనంపై భావనారాయణస్వామి తెప్పోత్సవం, తిలకిస్తున్న భక్తులు

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు

సామర్లకోట, మే 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెహెర్ కాంప్లెక్స్ వద్ద వేంచేసియున్న మహాలక్ష్మీ గణపతికి ప్రధానార్చకుడు తురుమళ్ళ శేషకుమార్ పంచ ద్రవ్యాలతో అభిషేకాలు, పుష్పార్చన నిర్వహించారు. స్వామివారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. సామర్లకోట, పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.


పొలిట్‌బ్యూరో సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప

'కంచి పీఠానికి రెండెకరాల స్థలం కేటాయించాలి'

సామర్లకోట, మే 14 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని కంచి పీఠం ఆవరణలో వేద పాఠశాల నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నారని, రెండె కరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలో ఆయన ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. మంచి కార్యక్రమానికి నాంది పలికిన చినరాజప్పను ముఖ్యమంత్రి అభినందిస్తూ స్థల పరిశీలనను అధికారులు పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించారు.


గొల్లప్రోలు-తాటిపర్తి పుంతరోడ్డు పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్

అభివృద్ధి పనుల పరిశీలన

గొల్లప్రోలు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నుంచి తాటిపర్తి వరకు పంచాయతీరాజ్ రహదారి (పుంత రోడ్డు)ని రూ.1.48 కోట్లతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులను పంచాయతీరాజ్ ఎస్ఈ ఏవీ శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈఈ ఎన్.కృష్ణమోహనరావు, ఏఈఈ కృష్ణమోహనరావు, ఎరికి నాయుడు ఉన్నారు.

కార్డన్ సెర్చ్‌లో 23 బైకులు స్వాధీనం

సర్పవరం జంక్షన్, మే 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం జగనన్న కాలనీలో బుధవారం తెల్లవారుజామున సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేని 23 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తిమ్మాపురం, ఇంద్రపాలెం, గొల్లపాలెం ఎస్ఐలు మూర్తి, వీరబాబు, మోహన్, సిబ్బంది, క్యూఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన

కాకినాడ రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మాదకద్రవ్యాలు, గంజాయి తాగడం వల్ల కలిగే నష్టాలు, వాటిని అమ్మడంతో పాటు రవాణా చేస్తే విధించే శిక్షలపై అవగాహన కల్పించినట్టు కాకినాడ సౌత్ ఎస్‌హెచ్‌వో టి.నిరంజన్‌రావు తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారికి డీ-అడిక్షన్ కేంద్రాల్లో చికిత్స ఇస్తామని, ఎవరికైనా మాదకద్రవ్యాల సమాచారం తెలిస్తే 14405 నెంబరుకు తెలియజేయాలన్నారు. సే నో టు డ్రగ్స్ స్టిక్కర్లను కళాశాలలు, పాఠశాలలు, పెట్రోల్ బంకుల్లో అంటించారు. ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


యండపల్లి చెరువులో సేద తీరుతున్న గేదెలు

ఎండ తీవ్రత ఉక్కబోత

కొత్తపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర ప్రాంతంలో బుధవారం 36 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రత, ఉక్కబోతతో ప్రజలు సతమతమయ్యారు. వృద్ధులు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడ్డారు. పశువులు చేలల్లో మేత మేయడం మాని చెరువుల్లోకి వెళ్లి ఉపశమనం పొందాయి.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌లపై అవగాహన

కాకినాడ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుమ్ములపేట శ్రీరామ్‌నగర్ సెంటర్లో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, గుంటూరు జిల్లా, ఎయిడ్స్ నియంత్రణ విభాగం కాకినాడ జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ 10వ డివిజన్ ఇన్‌చార్జి మూగు రాజు, క్లస్టర్ ప్రోగ్రాం జిల్లా మేనేజరు కేవీఆర్ శైలజ, జిల్లా సూపర్‌వైజర్ ఎ.బుజ్జిబాబు, ఏఎన్ఎంలు శైలజ, వరలక్ష్మి, ఐసీటీసీ కౌన్సిలర్ వినోద్ బాబు, ఉమామనోవికాస కేంద్రం ప్రతినిధులు రాజా, మోహన్, సోంబాబు, సుబ్బారావు, దేవరాజు, జిల్లా సహాయ బృందం సభ్యులు, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.



పాపిడిదొడ్డి చెరువులో మట్టి తవ్వకాలను ప్రారంభిస్తున్న దృశ్యం, మట్టి తవ్వకాలను అడ్డుకుంటున్న రైతులు, ఉపాధి కూలీలు, గ్రామస్తులు

ఎఫ్‌కే పాలెం చెరువులో మట్టి తవ్వకాలకు సన్నద్ధం

అడ్డుకున్న రైతులు, ఉపాధి కూలీలు, గ్రామస్తులు

ఉద్రిక్తత... ఎక్స్‌కవేటర్‌ను బయటకు పంపిన ఆందోళనకారులు

తవ్వకాలు జరిపితే సహించేది లేదని హెచ్చరిక

పిఠాపురం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం పాపిడిదొడ్డి చెరువులో మట్టి తవ్వకాలు జరిపేందుకు ఇటుక బట్టీల నిర్వాహకులు కొంతకాలంగా ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు అడ్డుకోవడంతో గతంలో తాత్కాలికంగా నిలిచిపోయింది. ప్రస్తుతం విరవాడకు చెందిన రైతు పేరిట ఇరిగేషన్ అధికారులు మట్టి తవ్వకాలకు అనుమతులు మంజూరు చేశారు. దీంతో బట్టీల నిర్వాహకులు బుధవారం రంగంలోకి దిగి ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వకాలకు సన్నద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న రైతులు, ఉపాధి కూలీలు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. సుమారు 350 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందకుండా పోతుందని, ఉపాధి కూలీలకు పని ఉండదని గ్రామస్తులు తెలిపారు. గతంలో జరిపిన తవ్వకాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇటుక బట్టీల నిర్వాహకుల కోసం అధికార పార్టీ నాయకులు మట్టి తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమయంలో తవ్వకందారులు, గ్రామస్తులు, రైతుల మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తత నెలకొంది. సుమారు ఐదు గంటల పాటు ఆందోళన కొనసాగించారు. చివరకు చెరువులో నుంచి ఎక్స్‌కవేటరును బయటకు పంపడంతో రైతులు, గ్రామస్తులు, ఉపాధి కూలీలు ఆందోళన విరమించారు. తవ్వకాలు సాగిస్తే సహించేది లేదని, అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మట్టి తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


గోగులమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు

గోగులమ్మకు మొక్కు చెల్లించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

పెదపూడి (కరప), మే 14 (ఆంధ్రజ్యోతి): అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఘన విజయం సాధించాలని టీడీపీ నేత ద్వారంపూడి గోపికృష్ణారెడ్డి పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని గోగులమ్మ అమ్మవారికి ఎన్నికల సమయంలో మొక్కుకున్నారు. ఆ కోరిక సాకారం కావడంతో కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే కుటుంబసమేతంగా హాజరై అమ్మవారికి మొక్కు చెల్లించారు. అంతకు ముందు ఎమ్మెల్యే దంపతులు సత్తెమ్మ తల్లి 5వ వార్షికోత్సవ వేడుకకు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ యువ నాయకుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి-సుమేఘ దంపతులు, డాక్టర్ నల్లమిల్లి సనాతని, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శేషుబాబ్జీ

'సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి'

కాకినాడ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుందరయ్య భవన్‌లో సీఐటీ యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అర్బన్ పీహెచ్‌సీ ఉద్యోగుల సంఘం నాయకుడు జీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పలువురు నేతలు మాట్లాడుతూ కార్మికులను కట్టుబానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, సహ కన్వీనర్ పలివెల వీరబాబు, వివిధ యూనియన్ల నాయకులు బి.శ్యామ్, ఎం.నాగేశ్వరరావు, మందపల్లి సూర్యప్రకాష్, కొల్లి శ్రీనివాస్, ఆర్.లక్ష్మీనారాయణ, ఎంవీ ప్రభాకరరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పులిమేరు గ్రామంలో బుధవారం రైతు కూలీలు, భవన నిర్మాణ కార్మికులతో ప్రదర్శన నిర్వహించారు. ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు, కర్షకులు, శ్రమజీవులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, డి.నారాయణమూర్తి, డి.సురేష్, రెడ్డి దుర్గాదేవి, వర్దనపు శివాజీ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించిన రిటైర్డ్ డీఎంఈ డాక్టర్ రాఘవేంద్రరావు

విజేతలకు అభినందన

సర్పవరం జంక్షన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో జరిగిన టైక్వాండో, కరాటే పోటీల్లో రాణించి 14 బంగారు, 13 రజత, రెండు కాంస్య పతకాలు సాధించిన వారికి మెడల్స్ ప్రశంసాపత్రాలను రిటైర్డ్ డీఎంఈ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు బుధవారం ప్రదానం చేశారు. వారికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ దడాల సతీష్‌ని అభినందించారు. బోట్ క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, కార్యదర్శి దాసరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక సమావేశం సజావుగా జరిగేందుకు సహకరించాలి'

సామర్లకోట, మే 14 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశాన్ని సజావుగా నిర్వహించేందుకు కౌన్సి లర్లు సహకరించాలని ప్రత్యేకాధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు సూచించారు. బుధవారం ఆయన సామర్లకోట కమిషనరు శ్రీవిద్యతో ఈ మేరకు సమావేశమయ్యారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడారు. కౌన్సిల్‌లో ప్రస్తుతం 31 మంది సభ్యులు ఉన్నారని, వారిలో మూడింట రెండు వంతుల మంది హాజరైతే సమావేశం ప్రారంభిస్తామన్నారు. కాగా వైసీపీ కౌన్సిలర్లకు ఆ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పాగా సురేష్‌కుమార్, సేపేని సురేష్ విప్ జారీ చేశారు.

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో

'శ్రీచైతన్య' విజయభేరి

సర్పవరం జంక్షన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కాకినాడ శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు విజయభేరి మోగించింది. వీఎస్ఎల్ఎన్‌వీ కృష్ణ 500 మార్కులకు 493 సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచినట్టు ఉత్తరాంధ్ర ఏజీఎం ఎంవీ సురేష్ తెలిపారు. 487 మార్కులతో నీల్ ప్రకాశ్ ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. నలుగురు 485కి పైగా, 12 మంది 480కి పైగా, 36 మంది 450కి పైగా, 117 మంది 400కి పైగా మార్కులు సాధించారన్నారు. ఉపాధ్యాయుల సమష్టి బోధనతో అత్యుత్తమ ఫలితాలు సాధించామని అకడమిక్ డైరెక్టర్ సీమ చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. రీజినల్ ఇన్‌చార్జి పి.గోపీనాథ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎస్.జనార్దన్, ప్రిన్సిపాల్ టి.శైలజ, డీన్ రవితేజ పాల్గొన్నారు.

'శిక్షణతో నైపుణ్యం పెంచుకోవాలి'

పిఠాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న విషయాలతో నైపుణ్యం పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పాలంకి నాగరాజు సూచించారు. పిఠాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కథలు విశ్లేషించడం, చెప్పించడం, చేతిరాతలో రామకృష్ణ ఇస్తున్న శిక్షణ, హ్యాండీక్రాఫ్ట్‌లో పి.దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు శ్రీదేవి శిక్షణ ఇచ్చి తయారు చేయించిన పేపర్ కళాకృతులను కలెక్టర్ షాన్ మోహన్ పరిశీలించారు. వారి వెంట గ్రంథాలయ అధికారి ఆర్.వెంకట రాము ఉన్నారు.

పేపర్ గ్లాసులతో బొమ్మ వాచీల తయారీపై అవగాహన

పెద్దాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో పేపర్ గ్లాసులతో వాచీలు తయారు చేయడంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. గణితంలో సులువైన అంశాలు తెలుసుకోవడాన్ని నేర్పించారు. చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్ధ శ్రీనివాస్, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రవివర్మ, పావని, కోనూరు రమణ రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్, అమృత, నమ్రత, నాని, సాయి, మణికంఠ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

'హరినామ సంకీర్తనకు అవకాశం కల్పించాలి'

పిఠాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని సన్నిధిలో అఖండ హరినామ సంకీర్తన భజనలకు అవకాశం కల్పించాలని, ఈ విషయం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు చేరే వరకు తమ పోరాటం సాగిస్తామని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామీజీ తెలిపారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీ రామాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు సానా నూకరాజు, సమన్వయకర్త ఏకేపీ సునీత, రామకోటి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పైడా అప్పలనాయుడు, సూర్యనారాయణ, యడ్ల ప్రభాకర్, చంటిబాబు, బాలిపల్లి రాంబాబు, సురేంద్ర దత్త, బావిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు.

దాడిలో గాయపడిన మత్స్యకార కుటుంబానికి పరామర్శ

కరప, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉప్పలంకలో ప్రత్యర్థుల దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త సంగాని ప్రసాద్, అతడి భార్య చినతల్లిని బుధవారం టీడీపీ కాకినాడ రూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకటప్రభాకర్ (బాబి) పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకన్న, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్‌గౌడ్, దాసరి దొరబాబు, పెంటపాటి చక్రం, సంగాని తాతారావు, వీరబాబు, గంగాద్రి, సింహాద్రి, మల్లాడి వీరబాబు, గోవిందమ్మ వున్నారు.

'బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి'

పిఠాపురం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. పిఠాపురం మండలం కందరాడలో కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బాలికలకు బుధవారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీవో దుర్గాదేవి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి, జీఎంఎస్‌కే అనుపమ, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

ముగిసిన గంగమ్మ తల్లి జాతర


గంగమ్మ తల్లి ప్రతిరూపమైన గోవ తాళ్లను ఊరేగిస్తున్న దృశ్యం

కరప, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపురప్పాడులో గంగమ్మ తల్లి జాతర మహోత్సవాలు ముగిసాయి. అమ్మవారి ప్రతిరూపమైన గోవతాళ్ల బుట్టకు మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. దాదాపు 60 గ్రామాల నుంచి విచ్చేసిన గొల్లలు అమ్మవారి గుడి ప్రాంగణంలో నిర్విరామంగా తప్పెటగుళ్ల, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు జరిపి జాతరకు మరింత వన్నె తీసుకువచ్చారు. చివరిరోజు గోవతాళ్లను ఊరేగించి గ్రామస్తులకు నిజరూప దర్శనం కల్పించారు. అనంతరం గుడిలోని దూలానికి గోవ తాళ్ల బుట్టను కట్టి అమ్మవారికి ఉద్వాసన పలికారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గొల్లపల్లి వంశీకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

యువతకు ఆసక్తి వున్న అంశాల్లో శిక్షణ: కలెక్టర్

పిఠాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): యువతకు ఆసక్తి ఉన్న అంశాల్లో శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండలరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీ, తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఏపీఎస్పీ కమాండెంట్ నాగేంద్రరావు

'లక్ష్య సాధనలో సమయం, ఏకాగ్రతలదే కీలక పాత్ర'

పిఠాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల లక్ష్య సాధనలో సమయం, ఏకాగ్రత కీలకపాత్ర పోషిస్తాయని ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు పేర్కొన్నారు. పట్టణంలోని సహృదయ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్న విద్యార్థులు బుధవారం కాకినాడలోని ఏపీఎస్పీ మూడవ బెటాలియన్‌ను సందర్శించారు. అక్కడ వివిధ విభాగాల పనితీరు గురించి అధికారులు వివరించారు. అనంతరం విద్యార్థులతో కమాండెంట్ మాట్లాడారు. లక్ష్య సాధనలో ఎన్నిసార్లు విఫలమైనా నిరుత్సాహపడవద్దని, సమాజంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు గతంలో ఏదో ఒక సమయంలో అపజయం చవిచూసిన వారేనని చెప్పారు. చదువుతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, సమయపాలన, నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, వెల్ఫేర్ ఆఫీసర్ రవిశంకర్, మిత్రమండలి ఉపాధ్యక్షుడు పోతుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ సతీష్, పోలుపర్తి వేణు, మహిళా కార్యదర్శి గంగాపావని, సత్యనారాయణ, కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.


అరుణాచలంలో పూజల్లో పాల్గొన్న కాకినాడ రూరల్ నియోజకవర్గ జన సైనికులు

అరుణాచలంలో జన సైనికుల పూజలు

సర్పవరం జంక్షన్, మే 14 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులపై దేశ రక్షణ, భద్రత కోసం ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనికులు, ప్రధాని మోదీకి దైవబలం, ఆశీస్సులు అందించాలని కోరుతూ బుధవారం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు జనసేన నాయకులు, కార్యకర్తలు తమిళనాడులోని అరుణాచలం అరుణాచలేశ్వర స్వామికి, చిత్తూరు జిల్లా కాణిపాకంలో శ్రీసిద్ధి వినాయక స్వామికి పూజలు చేశారు. త్రివిధ దళాల సభ్యులు ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు.

'సుప్రీం' సీజేగా జస్టిస్ గవాయ్ ప్రమాణస్వీకారంపై హర్షం

కాకినాడ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రమాణస్వీకారం చేయడంపై రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. జస్టిస్ బీఆర్ గవాయ్ తండ్రి ఆర్ఎస్ గవాయ్ 1956లో ఆర్‌పీఐ జాతీయ అధ్యక్షుడిగా సేవలందించారని గుర్తు చేశారు.

ముదునూరి పరామర్శ

ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గుండెవ్యాధి గ్రస్తుడు జువ్వల అప్పారావును బుధవారం నర్సాపురం పార్లమెంటరీ వైసీపీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. అప్పారావు గుండె సంబంధిత వ్యాధికి ఆపరేషన్ చేయించుకుని కోలుకుంటున్న అతడి ఇంటికి మురళీరాజు వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఎండలతో ప్రజల బెంబేలు



ఎండవేడిని తట్టుకోలేక తలపై చున్నీ కప్పుకుని వెళుతున్న యువతులు

మోతుగూడెం, మే 14(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం మన్యంలో వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. పగటిపూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఎండల్లో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వడదెబ్బ కు బారిన పడకుండా ముందు జాగ్రత్తల తీసుకోవడం మేలని వైద్యులు సూచిస్తున్నారు.

నీరు తక్కువ ఉంటే ముప్పే: శరీరంలో తగినంత నీటి పరిమాణం లేకుంటే వెంటనే సొమ్మసిల్లిపోయి పడిపోతారు. వడదెబ్బ తగిలినప్పుడు శరీరంలోని ద్రవాలు రక్తం పరిమాణం స్థాయి పడిపోవడం మెదడు, గుండెకు రక్తం ప్రసరణ జరగక మరణాలు సంభవిస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు.

నివారణ చర్యలు: వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే సమయంలో బయటకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండాలి. ఉదయం పూట పనులన్నీ పూర్తి చేసుకోవాలని, తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలపై టోపీ లేదా గొడుగు ఉపయోగించాలి. దాహం వేసేంత వరకు ఆగకుండా నీరు, ఇతర ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. చెమటను పీల్చుకుని వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. కళ్లకు రక్షణ కోసం చలువ కళ్లద్దాలు ధరించాలి. తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు మంచినీరు. జ్యూస్ తీసుకోవడం మంచిది. వేసవి కాలం వీలున్నంత వరకు మాంసాహారానికి దూరంగా ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తాటిముంజులు, కొబ్బరి బొండాలు, మంచినీరు, చెరుకు రసం, పండ్ల రసాలు, గంజి, మజ్జిగ, బార్లీ తీసుకోవాలి.

ప్రథమ చికిత్స : వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లని నీడ ఉన్న ప్రదేశానికి తీసుకువెళ్లాలి. తడిగుడ్డతో పలు మార్లు శరీరాన్ని తుడవాలి. ఎక్కువగా ద్రవ పదార్థాలు ఇవ్వాలి.గ్లాసు నీళ్లలో కొద్దిగా పంచదార, చిటికెడు ఉప్పు, నిమ్మరసం వేసి తాగించాలి. ఐవీ ఫ్లూయిడ్స్ ఇచ్చి వైద్యుల సంరక్షణలో బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేయించాలి. సాధారణస్థితిలోకి వచ్చే వరకు ఫ్లూయిడ్స్ ఎక్కించాల్సి ఉంటుంది.

రేపు పూజా సామగ్రి హక్కుకు వేలం

దేవీపట్నం, మే 14(ఆంధ్రజ్యోతి): గొందూరులోనున్న గండిపోశమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన కొబ్బరికాయలు వంటి వాటిపై 16న వేలంపాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేవస్థానానికి చెందిన సగభాగం కొబ్బరిచెక్కలు తీసుకునేందుకు, అమ్మవారి ఫొటోలు అమ్మడానికి, చీరలు, రవికలు, పూజా సామగ్రి అమ్మకునేందుకు, లడ్డూ ప్రసాదం, పులిహోర ప్రసాదం తయారీ నిమిత్తం అవసరమైన కిరాణా సామగ్రిపై లైసెన్సు హక్కు ఒక ఏడాదికి గాను ఈనెల 16న ఆలయం వద్ద టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల లోపు టెండర్లు దాఖలు చేయాలన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై వినతి



సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

దేవీపట్నం, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నారిగండి పరిధి పెనికలపాడు మూలమెట్ట ఆర్అండ్ఆర్ కాలనీ మూలమెట్ట, పెనికలపాడు గ్రామాల్లో పోలవరం నిర్వాసితులకు నేటికీ భూమికి భూమి ఇవ్వకపోవడంపై జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతికి వినతిపత్రం అందించారు. భూమికి నష్ట పరిహారం ఇవ్వలేదని, 18ఏళ్లు నిండిన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇల్లు నిర్మించకపోవడం, వ్యక్తిగత మరుగుదొడ్లు, స్కూల్ చుట్టూ ప్రహరీ లేకపోవడం తదితర ఇబ్బందులపై వినతిపత్రం అందించినట్లు ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, కుండ్ల సాయిరాంరెడ్డి, అరగంటి వీరభద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, తహశీల్దార్ కె.సత్యనారాయణ, సీఐ రవికుమార్, ఎస్ఐ కె.షరీఫ్, ఆర్ఐ భూలక్ష్మి, వీఆర్వో విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ఆదివాసీలు ఉద్యమించాలి



ర్యాలీలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

రంపచోడవరం, మే 14(ఆంధ్రజ్యోతి): అడవులు, అటవీ ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్పీ రెసిడెన్సీలో అఖిల భారత రైతుకూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా టాన్యా మాట్లాడారు. ఆదివాసీల రక్షణ కవచాలు 1/70, పీసా, అటవీ హక్కులు తదితర చట్టాల అమలుకు ఉద్యమించాలన్నారు. అనంతరం ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ మాట్లాడారు. తొలుత స్థానిక మార్క్స్-ఏంగెల్స్ భవనం నుంచి ఆర్పీ ఫంక్షన్ హాల్ వరకు ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ, పీవోడబ్ల్యు, ఐఎఫ్టీయూ, పీవైఎల్, ఎస్వైఎల్, పీడీఎస్యూ, ఏజెన్సీ గిరిజన సంఘాల నాయకులు తలారి ప్రకాష్, వేట్ల విజయ, పి.అనసూయ, ఇల్లా రామిరెడ్డి, పల్లాల లచ్చిరెడ్డి, జోగారావు, మడకం జోగమ్మ, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఎస్.కిరణ్కుమార్, వి.చిట్టిబాబు, సత్యనారాయణ, పి.ధర్మారెడ్డి, కుండ్ల నాగిరెడ్డి, కడబాల రామిరెడ్డి పాల్గొన్నారు.

మీకోసంలో 73 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో జగన్నాధరావు

చింతూరు, మే 14(ఆంధ్రజ్యోతి): చింతూరు ఐటీడీఏలో బుధవారం మీకోసం కార్యక్రమం జరిగింది. డివిజన్ పరిధిలో 73 మంది సమస్యలు పరిష్కారం కోసం వినతిపత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏపీవో (అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి) జగన్నాధరావు చెప్పారు. కార్యక్రమంలో పోలవరం ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

చింతూరు, మే 14(ఆంధ్రజ్యోతి): రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా అల్లూరి సీతారామరాజు జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నేతృత్వంలో బుధవారం చింతూరు ఐటీడీఏ ఎదుట నిరసన చేపట్టారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, పేద రైతులకు ఉచితంగా వంగడాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు సరఫరా చేయాలన్నారు. పాత రుణాలు రద్దు చేసి, వడ్డీ లేని కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాయం నాగేశ్వరరావు, మడకం చంద్రయ్య, కారం పొదయ్య, మడకం శిరమయ్య, జోగారావు, అనురాధ, సత్యవాణి, కారం లక్ష్మి, లక్ష్మీదేవి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టులు మినహాయించాలి

దేవీపట్నం, మే 14(ఆంధ్రజ్యోతి): 2025 మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టులు మినహాయించాలని కోరుతూ రంపచోడవరం ఐటీడీఏ వద్ద గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జీవో నెంబర్ 3 చట్టబద్ధతకు ఎన్నికల ముందు అరకులో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలన్నారు. తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ఏర్పాటుచేసి తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి 29శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పష్టత వచ్చే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అన్నవరంలో రామకోవెల ప్రారంభం



రామకోవెల, సంక్షేమ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో శ్రీకృష్ణదేవ రాయ కాపు, బలిజ, ఒంటరి, తెలగ సంక్షేమసంఘం ఆద్వర్యంలో సుమారు 50 లక్షలతో నిర్మించిన రామకోవెల, సంక్షేమభవనాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికబావనతో మెలిగాలన్నారు. సుమారు 10 సంవత్సరాలుగా పూర్తికాని భవనాన్ని సమష్టిగా ఏర్పడి పూర్తిచేయడం అభినందనీయమన్నారు. పార్టీలకతీతంగా నాయకులు వరుపుల తమ్మయ్యబాబు, పర్వత పూర్ణచంద్రప్రసాద్, ముద్రగడ గిరిబాబుతో పాటుగా ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్లు హాజరయ్యారు. వీరందరికీ సంఘనాయకులు వీర్ల సూరిబాబు, సుంకు జగదీష్ స్వాగతం పలికారు. అనంతరం 2వేలమందికి విశేష అన్నదానం వీర్ల సూరిబాబు దంపతులు ఏర్పాటుచేశారు.

సికిల్సెల్ అనీమియాపై సర్వే



మండపంలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శంఖవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): గిరిజనులలో వచ్చే సికిల్సెల్ అనీమియా వ్యాధిపై మండలంలో పలు గ్రామాల్లో సర్వే నిర్వహించారు. బుధవారం శంఖవరం, పెదమల్లాపురం ఆసుపత్రుల సిబ్బంది ఈ సర్వే చేపట్టారు. ఇది వంశపారంపర్యగా వచ్చే వ్యాధని, ఎర్రరక్త కణాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని, వ్యాధిగ్రస్తుడిని రక్తహీనతకు గురిచేస్తుందని శంఖవరం ఆసుపత్రి వైద్యులు సత్యనారాయణ తెలిపారు. సర్వే వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటనందూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు సబ్స్టేషన్ పరిధిలో గల గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట ఏఈ వీరబద్రరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఇండస్ట్రీయల్ ఫీడర్ మీద లైన్కు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించడంతో కేవీ.అగ్రహారం, కోటనందూరు, అల్లిపూడి గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

ఘనంగా నూకాలమ్మ దివ్య శిఖర ప్రతిష్ఠ

రౌతులపూడి, మే 14 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో నూకాలమ్మ ఆయల దివ్యశిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో బ్యాండ్మేళాలు, తారాజువ్వల నడుమ వైభవంగా ఉదయం9-21 నిమిషాలకు ప్రతిష్ఠ నిర్వహించారు. రెండు రోజులు పాటు ఆలయ ఆవరణ నందు బ్రహ్మశ్రీ పూజ్యం నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వీకరించారు.

వెలమ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రం ప్రారంభంలో వెలమ యూత్ సంఘ సభ్యులు

తుని రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): తుని నియోజకవర్గ వెలమ సంఘం అధ్యక్షుడు పరవాడ తాతబ్బాయి వెలమ యూత్ ఆధ్వర్యంలో తునిలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. బాటసారుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ప్రారంభించామని, వేసవి ముగిసే వరకు నిరంతరం ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

31న రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి



ప్రత్తిపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు రేచుకట్ల సింహాచలం

ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘర్షణ మోర్చ అనుబంధ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న అనకాపల్లిలో జరిగే రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు రేచుకట్ల సింహాచలం కోరా రు. స్థానిక సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం చేపట్టే కగార్ ఆపరేషన్ వల్ల అనేక గిరిజనులను హతమార్చుతున్నారని.. భూమి కోసం, భుక్తి కోసం, హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న గిరిజనులను మైనింగ్ మాఫియాలు, కార్పొరేట్ మాఫియాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. మే 31న నిర్వహించే రాష్ట్ర మహాసభ దేశం నలుమూలల నుంచి 50 మంది ప్రతినిధులు హాజరై గిరిజన హక్కుల కోసం ప్రసంగిస్తారని రేచుకట్ల తెలిపారు. సమావేశంలో లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, ఆదివాసీ సంఘ నాయకులు వనుగుల సీతయ్య, దోమల శ్రీనివాస్, కుడిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహంలో ప్రత్తిపాడు



ప్రత్తిపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి కేంద్రంగా ఉన్న ప్రత్తిపాడు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కి విలవిలలాడుతుంది. గ్రామంలోని అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ధర్మవరం వైపు రహదారి, కిర్లంపూడి వైపు రహదారుల నుంచి వచ్చే వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న వాహనాలను ఈ రెండు మార్గాల్లోని దుకాణాల ముందు నిలపడం, ఇరుకుమయమైన రహదారులు కావడం వల్ల కిక్కిరిసిపోతున్నాయి. దీంతో ప్రత్తిపాడు నుంచి సామర్లకోట, ధర్మవరం వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

200 మట్టి పాత్రల పంపిణీ



మట్టి పాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తుని రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సంక్షేమ సంఘం తుని పాయకరావుపేట ఆధ్వర్యంలో చుట్టారు. తుని - పాయకరావుపేట మెయిన్ రోడ్డులో మట్టి పాత్రల పంపిణీ చేపట్టారు. ప్రతి ఇంటి దగ్గర ఈ మట్టి పాత్రలో నీరు పోస్తే ఈ వేసవిలో మూగ జీవాలైన పక్షుల దాహార్తిని తీర్చవచ్చని, అందుకోసం సుమారు 200 మట్టి పాత్రలను పంపిణీ చేశామన్నారు. వేసవి తీవ్రత కారణంగా తుని మార్కెట్ రోడ్, పాయకరావు రావుపేట మెయిన్ రోడ్డు నందు సెంటర్లో మజ్జిగ పంపిణీ చేపట్టారు. సుమారు 7 వేల మందికి అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు కె.కిషోర్ రెడ్డి, పి. శ్రీనివాస రెడ్డి, ఎం.వెంకట రెడ్డి, అధ్యక్షుడు ఎం.వెంకట రాజారెడ్డి, సహ అధ్యక్షుడు కె.నారాయణ రెడ్డి, ట్రెజరర్ టి.సోమనాధ్రెడ్డి, ఎన్.కృష్ణారెడ్డి, కె.రామారెడ్డి, సీహెచ్ మణికంఠరెడ్డి, ఎస్.సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

పెళ్లికి ముందు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రంపచోడవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కొత్తగా పెళ్లిళ్లు చేసుకునే యువతి, యువకులు తప్పనిసరిగా మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. బుధవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం జరిపారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో పెళ్లికి ముందు రిజిస్ట్రేషన్ చేసుకుంటే సర్టిఫికెట్ ఇస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో పల్లెనిద్ర నిర్వహణ దృష్ట్యా అధికారులు పల్లెనిద్ర కార్యక్రమ ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్డీవో కె.కోటేశ్వరరావు, డీఎల్పీవో పద్మజ, సబ్కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి రమణి, ఈవోపీఆర్డీ శివకుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



హెల్మెట్ధారణపై వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

హెల్మెట్ ధారణపై ...పోలీసుల కౌన్సెలింగ్

కిర్లంపూడి, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణవరం టోల్ప్లాజా వద్ద పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ధారణపై కౌన్సిలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరించకపోతే జరిగే అనర్థాలు వివరించారు. బైక్ నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వారు సైతం హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. జగ్గంపేట సీఐ వైఆర్కె శ్రీనివాస్, కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట ఎస్ఐలు జి.సతీష్, యువి శివనాగబాబు, టి.రఘునాథరావు పాల్గొన్నారు.

తాండవ వంతెన పనులు వేగవంతం చేయండి



కోటనందూరులో పనులను పరిశీలిస్తున్న అర్అండ్బీ ఈఈ వెంకటేశ్వర్లు

కోటనందూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ క్రింద కోటనందూరులో చేపడుతున్న తాండవ వంతెన పనులను వేగవంతం చేయాలని అర్అండ్బీ ఈఈ వెంకటేశ్వర్లు గుత్తేదారులను ఆదేశించారు. దశాబ్ద కాలం నుంచి పాతవంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్తవంతెన నిర్మాణం రూ.10కోట్లతో చేపట్టామని తెలిపారు. ఆ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నామని, త్వరగా పనులు పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో గుత్తేదారు వెంకటరెడ్డి టీడీపీ, జనసేన నేతలు వెలగా వెంకటకృష్ణారావు, అంకారెడ్డి రాజశేషు, అంకారెడ్డిరమణ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

జగ్గంపేట/గండేపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని సీఐ వైఆర్ కే శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లా డుతూ గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండల గ్రామాల్లో కొంత మంది వన్య ప్రాణులకు వేటాటడం కోసం నాటుబాంబులు, నాటు తుపాకులు, విద్యుత్ వైర్లతో షాక్కు గురి చేయడం వల్ల కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అమాయక రైతులు, రైతు శ్రామికలు, ప్రజలు చని పోతున్నారని సీఐ పేర్కొన్నారు. గ్రామాల్లో నాటు బాంబు తయారీదారుల వివరాలను పోలీస్లకు తెలియజేయాలన్నారు. విద్యుత్ ఘాతాలకు పాల్పడే వారి సమాచారం పోలీసులు అందించాలన్నారు. సమాచారం తెలిసినవారు జగ్గంపేట సీఐ 94407 96529, ఎస్ఐ 9440796569, కిర్లంపూడి ఎస్ఐ 94409 04834, గండేపల్లి ఎస్ఐ 94409 04841, ట్రోల్ఫ్రీ నెంబరు 100/112 లో సంప్రదించాలని కోరారు.

జ్యోతిర్లింగాల పాదయాత్ర చేస్తున్న స్వామీజీకి స్వాగతం



స్వామీజీతో మాట్లాడుతున్న నాగేంద్రచౌదరి

గండేపల్లి, మే 14(ఆంధ్రజ్యోతి): డిల్లీ రాష్ట్రానికి చెందిన ముఖేష్ స్వామీజీ గంగోత్రిలో పాదయాత్ర ప్రారం భించి మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రలో ఉన్న జ్యోతిర్లింగం దర్శనం చేసుకుని గండేపల్లి మండలం జడ్.రాగంపేట గ్రామానికి చేరుకున్నారు. ఆయనకు భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర నిర్వాహణ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి ఘన స్వాగతం పలికి జడ్.రాగంపేటలోని మోహన్కృష్ణా రెసిడెన్సీలో వసతి, భోజన సదుపాయం కల్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి పాదయాత్రలో ఆటంకాలు రాకుండా దిగ్విజయం జరగాలని కోరారు.

విద్యుత్శాఖ సిబ్బంది పట్టించుకోవడంలేదని నిరసన



విద్యుత్ ట్రాన్స్ఫారం వద్ద నిరసన తెలుపుతన్న వినియోగదారులు

అన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నాల్గో వార్డులో గడిచిన నాలుగునెలలుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నా విద్యుత్శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదని విద్యుత్ వినియోగదారులు నిరసన వ్యక్తం చేశారు. ఫిర్యాదులు చేసినా సరైన స్పందన ఉండడం లేదని, ఒక్కోసారి తాత్కాలిక పరిష్కారం చేసి వెళ్లిపోతున్నారని శాశ్వత పరిష్కారం చూపాలని డిమా ండ్ చేశారు.

నలుగురిపై బైండోవర్ కేసులు



నలుగురికి కౌన్సెలింగ్ ఇస్తున్న దృశ్యం

జగ్గంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువులకు ట్రాప్ పెట్టే అలవాటు ఉన్న జగ్గంపేట మండలం నరేంద్రపట్నం గ్రామానికి చెందిన నలుగురిని, గతంలో కేసులు ఉన్నవారిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపెట్టి కౌన్సింగ్ నిర్వహించడం జరిగిందని సీఐ వైఆర్కె శ్రీనివాస్ పేర్కొన్నారు.